క్లుప్తంగా

రైతులకు అండగా ప్రభుత్వం



మాట్లాడుతున్న చైర్మన్ రాజగోపాల్ రెడ్డి

ఆస్పరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటున్నారని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆస్పరి వ్యవసాయ కార్యాలయంలో మండల స్థాయి వ్యవసాయ మండలి సమావేశం చైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ నరేంద్రకుమార్ మాట్లాడుతూ.. ఖరీఫ్‌లో పత్తి, వేరుశనగ, కొర్ర, సజ్జ పంటలు 53 వేల ఎకరాల్లో వేశారన్నారు. వర్షాలు లేకపోవడంతో ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించింద న్నారు. మండలంలోని చిరుమాన్‌దొడ్డి గ్రామానికి చెందిన రంజాన్ సాహెబ్ అనే రైతు అప్పుల బాధతో చనిపోయాడని, ఆయన కుటుంబానికి ప్రభుత్వం రూ.7 లక్షలు ఆర్థిక సహాయం మంజూరు చేసిందన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, మండల సొసైటీ చైర్మన్ కట్టెల గోవర్ధన, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెద్దయ్య, నాయకుడు శివారెడ్డి పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణలో నిర్లక్ష్యం వద్దు



కృష్ణగిరిలో బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహిస్తున్న తహసీల్దార్ రాజేశ్వరి

కృష్ణగిరి: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు జాబితా సవరణను పకడ్బందీగా చేపట్టాలని, ఇందులో నిర్లక్ష్యం తగదని తహసీల్దార్ రాజేశ్వరి హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో శుక్రవారం ఆమె బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఓటరు నమోదు ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందన్నారు. అయితే జాబితాలో తొలగించే ఓట్లకు సంబంధించి అన్ని అధారాలను పక్కాగా సేకరించి పెట్టుకోవాలని సూచించారు. కొత్తగా ఓటరు నమోదు, మార్పులు, చేర్పులకు సంబంధించిన దరఖాస్తులను తీసుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. అన్ని గ్రామాల బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

సైన్స్ పరిజ్ఞానం పెంచుకోవాలి



సైన్స్ టాలెంట్ టెస్ట్ రాస్తున్న విద్యార్థులు

గోనెగండ్ల: విద్యార్థులు సైన్స్ పరిజ్ఞానం పెంచుకోవాలని జనవిజ్ఞాన వేదిక సైన్స్ కో–ఆర్డినేటర్ విజయ్‌కుమార్, గుమ్మలబాబు సూచించారు. శుక్రవారం గోనెగండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థులకు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ టాలెంట్ టెస్ట్‌కు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ టెస్ట్ రాయడం వలన విద్యార్థుల్లో సైన్స్‌పై అభిరుచి, అవగాహన, సృజనాత్మక పెంపొందించేందుకు ఉపయోగపడుతుందన్నారు. అలాగే భవిష్యత్‌లో మూఢ నమ్మకాలు, అస్పృశ్యతపై అవగాహన కలిగి ఉంటారని చెప్పారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకోవాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న సర్పంచ్ సుహాసిని

మద్దికెర: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీడీఓ నరసింహమూర్తి, ఎంఈఓ రంగస్వామి అన్నారు. శుక్రవారం స్థానిక విద్యాసాయి విద్యాసంస్థల విద్యార్థులు పరిశుభ్రత, పర్యావరణంపై చేపట్టిన అవగాహన ర్యాలీని సర్పంచ్ సుహాసిని జెండా ప్రారంభించారు. గ్రామ పురవీధుల గుండా నినాదాలు చేసుకుంటూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మహాత్మాగాంధీ కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, ఎంపీపీ అనిత, ప్రిన్సిపాల్ సునీత, కరస్పాండెంట్ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగుచేసి నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రయ్య కోరారు. శుక్రవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఏపీ రైతు సంఘం కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఖరీఫ్ సీజన్లో రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. డిసెంబర్ 18, 19 తేదీల్లో ఎమ్మిగనూరు పట్టణంలో జరిగే ఏపీ రైతు సంఘ జిల్లా 10వ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రైతుసంఘం జిల్లా కార్యదర్శి జగన్నాథం, నాయకులు పంపన్నగౌడ్, రంగన్న, చిన్నన్న తదితరులు పాల్గొన్నారు.

జగనన్న విజయం పేదలకు అభయం

- 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి
- వైఎస్సార్‌సీపీ పాలనలో విద్య, వైద్య రంగాలలో విప్లవాత్మక మార్పులు
- అన్ని వర్గాల అభ్యున్నతికి సహకారం



నందవరంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి



లబ్ధిదారురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

నందవరం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అణగారిన బతుకులకు ఊతకర్రగా నిలిచారని ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి ఉద్ఘాటించారు. విద్య, వైద్య రంగాలలో విప్లవాత్మక మార్పులు తీసువచ్చి పేద పిల్లలకు నాణ్యమైన చదువులతో పాటు వైద్య సేవలు అందించారన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం-2 పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో భాగంగా సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో ర్యాలీగా వెళ్లి వాటర్ ట్యాంకు వద్ద జెండావిష్కరణ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో నందవరం మండలంలో 20 వేల మందికి రూ.54 కోట్లు డీబీటీ ద్వారా అందించారన్నారు. అలాగే నాన్ డీబీటీ ద్వారా రూ.20 కోట్లు ఖర్చు చేశారని వివరించారు. సంక్షేమ పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంతరెడ్డి, నాయకులు శివారెడ్డిగౌడ్, పేట శ్రీనివాసరెడ్డి, నిఖిల్ చక్రవర్తి, తోట సావిత్రి, విరుపాక్షిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్ర భవిష్యత్తు

పత్తికొండటౌన్: రాష్ట్రంలో సంక్షేమ పాలన నిరంతరాయంగా కొనసాగాలంటే జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. పత్తికొండ గ్రామసచివాలయం-2 వద్ద శుక్రవారం సాయంత్రం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి గ్రామ సచివాలయంలో ఏర్పాటుచేసిన సంక్షేమ వివరాల బోర్డును ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గడచిన నాలుగున్నరేళ్లలో గ్రామసచివాలయం-2 పరిధిలోనే వివిధ సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు రూ.28కోట్లు అందజేసినట్లు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు అధికారం కోసం 600 హామీలు ఇచ్చి, వాటిలో వంద కూడా నెరవేర్చలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుని 99.9 శాతం హామీలను నెరవేర్చాడన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని, జగనన్నను నిండు మనసుతో మళ్లీ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్ అఫ్జల్ హుసేన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ నారాయణదాసు, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ, పత్తికొండ సర్పంచ్ కొమ్ముదీపిక, మాజీ సర్పంచ్ సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

దేవనకొండ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిద్దామని, ఏపీకి వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాల్సిన ఆవశ్యకతను వివరిద్దామని దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, జేఏసీ జిల్లా కన్వీనర్ తెర్నెకల్ సురేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం దేవనకొండలోని సచివాలయం–2లో 'ఏపీకి జగన్ ఎందుకు కావాలి' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. జెడ్పీటీసీ రామకృష్ణ, మండల కన్వీనర్ మల్లికార్జున, కో కన్వీనర్ కబీర్‌దాసు, మండల జేఏసీ కన్వీనర్ రాజారెడ్డి, నిజాల్‌రెడ్డి, ప్రేమనాథ్‌రెడ్డి, అలారుదిన్నె ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తుగ్గలి: గిరిగెట్లలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నాగేష్‌యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో కలిసి వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ఈఓపీఆర్డీ తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణగిరి: ఏపీలో జగనన్న అందిస్తున్న సుపరిపాలనతో రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం విస్తృతంగా సాగుతోందని ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, జెడ్పీటీసీ కేఈ సుభాషిణి అన్నారు. అమకతాడు గ్రామ సచివాలయంలో సర్పంచ్ బోయ సర్వేశ్వరి, పార్టీ మండల కన్వీనర్ ఆర్‌బీ వెంకటరాముడుతో కలిసి సంక్షేమ వివరాల బోర్డును ఆవిష్కరించి బస్టాండ్ సమీపంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు.

మద్దికెర: స్థానిక సచివాలయ-2లో జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాల బోర్డును ఆవిష్కరించారు. ఎంపీడీఓ నరసింహమూర్తి, ఈఓఆర్డీ మద్దిటిస్వామి, సచివాలయ కన్వీనర్ కవిదాసు పాల్గొన్నారు.

హాలహర్వి: మండల పరిధిలోని బాపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, జెడ్పీటీసీ లింగప్ప, మండల కన్వీనర్ భీమప్పచౌదరి, సర్పంచ్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో 'వై ఏపీ నీడ్స్ సీఎం జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. నాయకులు పరశురాం, నాగేంద్ర, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పరి: మానమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆస్పరి సచివాలయం-2లో సంక్షేమ పథకాల వివరాల బోర్డును సర్పంచ్ మూలింటి రాధమ్మ ఆవిష్కరించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా వెళ్లి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడే వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. జడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, కేడీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, మండల సొసైటి చైర్మన్ కట్టెల గోవర్ధన, ఈఓఆర్డీ సూర్య నరసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు: ఆలూరులో సచివాలయం-2లో వైఎస్సార్‌సీపీ నాయకుడు నారాయణస్వామి ఆధ్వర్యంలో సంక్షేమ వివరాల బోర్డును మండల కన్వీనర్ వీరేష్‌తో కలిసి ఆవిష్కరించారు. అలాగే పార్టీ జెండాను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ సచివాలయం పరిధిలో ఇప్పటివరకు 4,529 మంది లబ్ధిదారులకు రూ 23,65,95,591 లబ్ధి చేకూరిందని వివరించారు. ఎంపీపీ రంగమ్మ, ఎంపీటీసీ సభ్యులు జంగాల మోతి ఎల్లమ్మ, వైస్ ఎంపీపీ నాగవేణి, తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: రాష్ట్రంలోని పేదలకు మేలు జరగాలన్నా.. బడుగు బలహీన వర్గాలు రాజకీయంగా ఉన్నత స్థానాలకు వెళ్లాలన్నా.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో భాగంగా ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులతో కలిసి వైఎస్సార్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన పార్టీ జెండాను ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మన్సూర్, బందే నవాజ్, భాస్కర్ రెడ్డి, దొరబాబు, గోవింద్, నాయుడు, మునెప్ప తదితరులు పాల్గొన్నారు.



బాపురంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఆస్పరిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న పార్టీ మండల కన్వీనర్ పెద్దయ్య

ఎమ్మిగనూరుటౌన్: పేద బడుగు బలహీన వర్గాలకు ప్రస్తుతం మంజూరవుతున్న సంక్షేమ పథకాలు, రాష్ట్ర అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ తెర్నెకల్ సురేందర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని 20వ వార్డు సచివాలయ పరిధిలో వైఎస్ఆర్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల సిఫారసు ఉంటేనే సంక్షేమ పథకాలు వర్తించేవన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరు వాత పార్టీలు, కులం, మతం చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని కొనియాడారు.మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వైఎస్ఆర్‌సీపీ జిల్లా కార్యదర్శి రియాజ్‌అహమ్మద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు బుట్టారంగయ్య, అధికా ర ప్రతినిధి సునీల్‌కుమార్, టౌన్ బ్యాంక్ చైర్మన్ యుకె రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎర్రకోట జగన్, తెర్నెకల్ సురేందర్ రెడ్డి



గిరిగెట్లలో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



అమకతాడు సచివాలయంలో సంక్షేమ బోర్డును అవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



మద్దికెర సంక్షేమ వివరాల బోర్డును ప్రదర్శిస్తున్న దృశ్యం



దేవనకొండలో ప్రజలకు సంక్షేమ బుక్‌లెట్‌ను అందజేస్తున్న గుమ్మనూరు శ్రీనివాసులు



ఆలూరులో సంక్షేమ వివరాల బోర్డును ఆవిష్కరిస్తున్న గుమ్మనూరు నారాయణస్వామి

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



కంటి వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

మద్దికెర: కంటి వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని కంటి చూపును మెరుగుపరుచుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి, వైద్యశిబిరం నిర్వాహకులు విజయప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఫ్రెండ్స్ విద్యానికేతన్ పాఠశాలలో గత నెలలో దాతలు అర్థగేరి రామకృష్ణారెడ్డి, రుక్మిణమ్మ జ్ఞాపకార్థం ప్రవాస భారతీయులు ప్రేమసాగర్‌రెడ్డి, శాంతిరెడ్డి ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో కంటి ఆపరేషన్లు చేసి అవసరమైన వారికి మళ్లీ పరీక్షలు చేసి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దూర ప్రాంతాలకు వెళ్లలేని వారికి మొబైల్ ఆపరేషన్ వాహనాలు ఏర్పాటు చేసి కంటి చికిత్సలు చేయడం జరిగిందన్నారు. మరింత మందికి చైన్నైలోని శంకర నేత్రాలయ ఆసుపత్రిలో ఆపరేషన్లు చేయడం జరుగుతుందన్నారు. పాఠశాల కరస్పాండెంట్ రామాంజులు, మాజీ ఉప సర్పంచ్ నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా అవగాహన



అలూరులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

అలూరు రూరల్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో ఫ్రైడే – డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి ప్రజలకు సీజనల్ వ్యాధులు ఎలా వ్యాపిస్తాయి. నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. దోమలు వృద్ధి చెందకుండా ఇళ్లలోని డ్రమ్ములు, ప్లాస్టిక్ డబ్బాలలో ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉంచుకోరాదన్నారు. అలాగే ఉతికిన బట్టలు ఎప్పటికప్పుడు ఆరవేయాలన్నారు. దోమల బారి నుంచి కాపాడుకునేందుకు దోమ తెరలు వాడాలని సూచించారు. రోజు విడిచి రోజు జ్వరం దగ్గు వంటి లక్షణాలు ఉంటే ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలన్నారు. మూడు పూటల వేడి ఆహారం తీసుకోవాలని చెప్పారు.

గ్రామాభివృద్ధి చూసి మాట్లాడండి !

అలూరు: టీడీపీ నేతలు గుమ్మనూరు గ్రామ అభివృద్ధిని చూసి మాట్లాడాలని ఆలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ గుమ్మనూరు నారాయణ స్పష్టం చేశారు. ఆయన శుక్రవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మాట్లాడుతూ.. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ కోట్ల సుజాతమ్మ గుమ్మనూరు గ్రామ పర్యటనను అడ్డుకోవాల్సిన ఖర్మ తనకు పట్టలేదన్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం పేరుతో సుజాతమ్మ గురువారం గ్రామాన్ని సందర్శించారన్నారు. ఆమె పర్యటనను తాము అడ్డుకున్నట్లు కొందరు టీడీపీ నేతలు తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సొంత గ్రామానికి బీటీ రోడ్డు వేయించుకోలేరని విమర్శించిన సుజాతమ్మ నేడు అదే రోడ్డుపై ప్రయాణించారని గుర్తుచేశారు. మంత్రి జయరాం తమకు ఫ్యాక్షన్ రాజకీయాలు నేర్పలేదని, ప్రజలకు సేవ చేయడమే నేర్పారని స్పష్టం చేశారు.

బీమా తక్షణ సాయం అందజేత

మద్దికెర: మండల కేంద్రంలోని గిడ్డయ్య వీధిలో కనక పల్లవి అనారోగ్యంతో మరణించడంతో భర్త కుమార్‌కు వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద మంజూరైన రూ.10 వేల నగదును సర్పంచ్ సుహాసిని, ఈఓఆర్డీ మద్దిలేటి స్వామి, సంక్షేమ అధికారి ఆదినారాయణ శుక్రవారం అందజేశారు. మిగతా సొమ్ము త్వరలో నామినీ బ్యాంకు ఖాతాలో జమ అవుతుందన్నారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ నాసర రెడ్డి

ఎమ్మిగనూరురూరల్: రాబోవు ఎన్నికలకు అధికారులు సిద్ధంగా ఉండాలని జెడ్పీ సీఈఓ నాసర రెడ్డి ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం మండల పరిషత్ సమావేశ భవనంలో తాలుకా స్థాయి సెక్టోరల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ఇప్పటి నుంచే ఎటువంటి పొరపాట్లు లేకుండా పోలింగ్ కేంద్రాలు, ఇతర సమస్యలను గుర్తించి పరిష్కరించుకోవాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే తర్వాత ఇబ్బందులు పడాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు ఉన్నాయా? లేదా? పరిశీలించి ఏమైనా ఇబ్బందులుంటే సరిచేసుకోవాలన్నారు. ఉన్నతాధికారుల సమావేశాలకు తప్పనిసరిగా హాజరుకావలసి ఉంటుందని చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. తహసీల్దార్లు ఆంజనేయులు, వేణుగోపాల్, ఎన్నికల డీటీ గురురాజరావు, సెక్టోరల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లెల్సీ నీరు జీడీపీకి మళ్లింపు

గోనెగండ్ల: తుంగభద్ర దిగువ కాలువ నీటిని జీడీపీ అధికారులు గాజులదిన్నె ప్రాజెక్టులోకి మళ్లించారు. శుక్రవారం నీటి పారుదల శాఖ ఎస్ఈ రెడ్డి శేఖర్ రెడ్డి, ఈఈ శైలేశ్వర్ రెడ్డితో కలిసి గోనెగండ్లలోని ఎస్కేప్ చానల్‌ను పరిశీలించారు. ఎస్ఈ మాట్లాడుతూ గోనెగండ్ల సెక్షన్ దిగువ కాలువకు దాదాపు 200 క్యూసెక్కుల నీరు వస్తోందని, తాగునీటి అవసరాల కోసం 104 క్యూసెక్కుల నీటిని ఎస్కేప్ ఛానల్ ద్వారా గాజులదిన్నె ప్రాజెక్ట్‌కు మళ్లించడం జరిగిందన్నారు. జీడీపీలో ప్రస్తుతం 0.5 టీఎంసీల నీటి నిల్వ ఉందన్నారు. ప్రాజెక్టు ద్వారా డోన్, పత్తికొండ, దేవనకొండ తదితర పట్టణా లకు తాగు నీటిని సరఫరా చేసేందుకు ఎల్లెల్సీ కాలువ ద్వారా నీటిని జీడీపీలోకి మళ్లించినట్లు తెలిపారు. ఎవరైన జలచౌర్యానికి పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. డీఈ లక్ష్మణ కుమా ర్, ఏఈ ఉదయ్ భాస్కర్ సిబ్బంది పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలపై అవగాహన

మద్దికెర: ఖరీఫ్, రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలు, కంది, పప్పుశనగ పంటలను కాపాడుకోవడానికి రైతులు వ్యవసాయాధికారులు సూచించిన సస్యరక్షణ పద్ధతులు పాటించాలని ఏఓ రవి అన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రైతులు సబ్సిడీతో జొన్నలు అందించాలని కోరారని, ఈ విషయాన్ని జిల్లా అధికారులకు తెలియజేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం పంటలను కాపాడుకునేందుకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. చైర్మన్ భీమలింగప్ప, సభ్యులు హనుమంతు, రేవన్న, బొమ్మనపల్లి వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోతలు

ఎమ్మిగనూరుటౌన్: శిరాలదొడ్డి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తుండటంతోపాటు పట్టణంలో మరమ్మతు పనులు చేస్తుండటంతో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ రాఘవేంద్ర శుక్రవారం తెలిపారు. పట్టణవాసులు సహకరించాలని కోరారు.

తుగ్గలి: మరమ్మతు పనుల దృష్ట్యా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య మండలంలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మహేశ్వరరెడ్డి తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పది పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

తుగ్గలి: పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫీజు చెల్లించడానికి గడువు పొడిగించినట్లు శుక్రవారం ఎంఈఓ-2 రామవెంకటేశ్వర్లు తెలిపారు. ఈనెల 10వ తేదీ వరకు ఉన్న గడువును మరో పది రోజులు పొడిగిస్తూ రాష్ట్ర విద్యా శాఖ ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 20వ తేదీ లోగా ఫీజు చెల్లించే విధంగా గడువును పెంచారన్నారు. అపరాధ రుసుంతో డిసెంబర్ 5వ తేదీలోపు చెల్లించవచ్చన్నారు.

పట్టణాభివృద్ధే ధ్యేయం



అన్నమయ్య సర్కిల్‌లో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: కోట్లాది రూపాయలు వెచ్చించి పట్టణంలో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఆదోని రోడ్డులోని అన్నమయ్య సర్కిల్ వద్ద రూ.86 లక్షలతో ఆదోని – కర్నూలు ప్రధాన రహదారిలో గోనెగండ్ల బైపాస్ రోడ్డు వరకు ఏర్పాటు చేయనున్న సెంట్రల్ లైటింగ్ పనులకు శుక్రవారం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, కమిషనర్ గంగిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ సుందరీకరణలో భాగంగా సెంట్రల్ లైటింగ్‌తో ప్రధాన రహదారిలో విద్యుత్ వెలుగులు విరజిమ్మనున్నాయన్నారు. పట్టణంలో ఇప్పటికే సోగనూరు రోడ్డు, లక్ష్మణ్ థియేటర్ నుంచి ఎస్ఎస్ ట్యాంక్ వరకు, హెచ్‌బీఎస్ కాలనీలోని ఎల్ఐసీ కార్యాలయ రోడ్డు, మిలటరీ కాలనీ రోడ్లు దాదాపు రూ. 3.5 కోట్లకు పైగా వెచ్చించి బీటీ రోడ్లు నిర్మించడం జరిగిందన్నారు. ప్రతి వార్డులో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలతో పాటు మంచినీటి పైప్‌లైన్ల ఏర్పాటు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని తెలిపారు.అన్ని వార్డులో ప్రణాళిక ప్రకారం అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. అలాగే ప్రధాన రహదారి డివైడర్ మధ్యలో మొక్కల పెంపకం, పచ్చదనం కోసం నీటిని సరఫరా చేసేందుకు బోరు వేసే పనులను కమిషనర్ ప్రారంభించారు. మున్సిపల్ డీఈ మనోహర్‌రెడ్డి, ఏఈ శరత్, వైస్ చైర్మన్ నజీర్‌అహ్మద్, వైఎస్సార్‌సీపీ నాయకులు భీమిరెడ్డి, సునీల్‌కుమార్, సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేర్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్



దివ్యాంగుడికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎర్రకోట జగన్

గోనెగండ్ల: మేనిఫెస్టోలోని హామీలన్నీ నేరవేర్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గోనెగండ్ల 8, 9వ వార్డులలో, అలాగే సాయంత్రం బైలుప్పల గ్రామంలో అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకొని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ.. మేనిఫెస్టోను పవిత్రంగా భావించి సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని, మాజీ సీఎం చంద్రబాబు అధికారంలోకి రాగానే మేనిఫెస్టోను మాయం చేసి పెత్తందారులకు, తన సామాజిక వర్గానికి ప్రజాధనాన్ని దోచిపెట్టారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగనన్నను మరోసారి సీఎంగా చేసుకుందాం అని పిలుపునిచ్చారు. మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఎస్‌బీ మన్సూర్, యూత్ అధ్యక్షుడు బందెనవాజ్, సింగిల్ విండో ఉపాధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, కన్వీనర్ దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

నిధులున్నా పనులు పూర్తి చేయరా?



ఏంఈఓ రాజేంద్రప్రసాద్‌ను వివరాలు అడుగుతున్న జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు

ఆస్పరి: నాడు–నేడు కింద పాఠశాలల్లో అదనపు గదులు నిర్మించాలని ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా పనులు పూర్తి చేయరా అంటూ జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు ఎంఈఓ రాజేంద్రప్రసాద్‌ను ప్రశ్నించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సుంకర ఉమాదేవి అధ్యతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. మండలంలోని నగరూరు జిల్లా పరిషత్ హైస్కూలుకు నాడు–నేడు కింద ప్రభుత్వం రూ.43 లక్షలు మంజూరు చేసిందన్నారు. అయితే ఇప్పటివరకు బెస్‌మెంట్ వరకు మాత్రమే పనులు చేసి నిలిపివేశారన్నారు. ప్రభుత్వం అందించిన 10 వేల ఇటుకలు, 1200 బస్తాల సిమెంట్, 10 లక్షల విలువైన కడ్డీలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇవేగాక ఆస్పరి కస్తూర్బా పాఠశాలలో 4 గదుల నిర్మాణం కోసం రూ.25 లక్షలు మంజూరు చేసినా ఇప్పటి వరకు నిర్మాణాలు పూర్తి చేయలేదన్నారు. అధికారులు నిర్లక్ష్యం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. స్పందించిన ఏంఈఓ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు చెప్పి పనులు వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం వ్యవసాయం, ఉపాధి, విద్య, వైద్యం, అంగన్‌వాడీ తదితర శాఖలకు చెందిన అధికారులు వారి పని తీరు గురించి వివరించారు. ఎంపీడీఓ రాణెమ్మ, డీటీ గాయిత్రీ, డాక్టర్ బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.